సాక్షి
శ్రీకాకుళం

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



టార్గెట్ నంబర్ 1

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలోనే నంబర్ 1 స్థానం సాధించాలంటున్నారు. - 8లో



పాముకాటుతో రైతు మృతి

పాముకాటుతో ఓ రైతు మృతి చెందారు. చిన్నబొరిగివలసలో ఘటన జరిగింది. - 8లో

ఏయూ సదస్సుకు శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న విశాఖపట్నం ఆంధ్రాయూనివర్సిటీ ప్రత్యేక సదస్సు నిర్వహిస్తోంది. తెలుగు విభాగంతో పాటు సమైక్య భారతి, ఖరగ్‌పూర్ (పశ్చిమ్‌బెంగాల్), ఆంధ్రభవన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని, తొలి సదస్సు మొదటి వక్తగా నాటి పత్రికల మేటి భాషా సేవ గురించి శ్రీకాకుళం వాసి, పత్రికా రచయిత జంధ్యాల శరత్‌బాబు ప్రసంగిస్తారని నిర్వాహకులు ప్రకటించారు.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు



ఎంపికల్లో క్రీడాకారుల ప్రతిభను పరిశీలిస్తున్న సెలెక్టర్లు, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్-14, అండర్-16 ప్రాబబుల్స్ జట్ల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానంలో క్రికెట్ నెట్స్‌లో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 130 మంది క్రీడాకారులు హాజరైనట్టు సంఘ ప్రతినిధులు తెలిపారు. 2024-25 సీజన్‌లో జరగనున్న ఏసీఏ నార్త్‌జోన్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేసేందుకు ముందస్తుగా ప్రాబబుల్స్ క్రీడాకారులను ఎంపిక చేస్తున్నారు. త్వరలో శిక్షణ శిబిరాలు, సెలెక్షన్ మ్యాచ్‌లను నిర్వహించిన తర్వాత తుది జట్లను ప్రకటిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాస్త్రి, హసన్‌రాజా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘ మెంటార్ మహ్మద్ ఇలియాస్, జిల్లా క్రికెట్ సంఘ కోశాధికారి మదీనా సైలానీ, సెలెక్షన్ కమిటీ మెంబర్లు కొట్టిస కిరణ్, దీపక్‌కుమార్, ఎం.వెంకటరమణ, కోచ్ సుదర్శన్, ఆనంద్‌కుమార్, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో మెరిసిన ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి



క్యాష్ బహుమతి అందుకుంటున్న ప్రణీత్‌రాజ్

కాశీబుగ్గ: ఎడ్యుకేషనల్ ఎపిఫని అనే స్వచ్ఛంద సంస్థ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పదో తరగతి ప్రతిభా పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి మెరిశాడు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చినబడం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మల్లా ప్రణీత్‌రాజ్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. రాష్ట్ర విద్యాశాఖ సహకారంతో పూర్తిగా ఆన్‌లైన్‌లో రెండు దశల్లో నిర్వహించిన పరీక్షలో సుమారుగా 9000 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రణీత్ రాజ్ మొదటిస్థానంలో నిలిచాడు. విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపికతో పాటు రూ.30 వేల నగదు బహుమతిని అందుకున్నాడు. విద్యార్థి తండ్రి ఆదినారాయణ చిరు వ్యాపారి, తల్లి పుష్పలత గృహిణి. విద్యార్థి విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, విద్యాకమిటీ చైర్మన్ చంద్రశేఖర్, దాసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రీన్ ఆర్మీ కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శృతి

గార: శాలిహుండంలోని శ్వేతగిరిపై భీష్మ ఏకాదశి నాడు జరిగే కాళీయ మర్దన వేణుగోపాలస్వామి సంబరంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వై.శృతి అన్నారు. ఆదివారం సాయంత్రం శాలిహుండంపై ఆలయం వద్ద జరుగుతున్న ఉత్సవ ప నులను ఆమె పరిశీలించారు. ముందు రోజు రాత్రి భక్తులు దూర ప్రాంతాల నుంచి వచ్చే అవకాశం ఉండటం వల్ల బందోబస్తు చూడాలన్నారు. గార, హైవే నుంచి వచ్చే వాహనాలు పూసర్లపాడు వద్ద నిలుపుదల చేస్తామని సీఐ ఎల్. సన్యాసినాయుడు తెలియజేశారు. వాహనాలకు కొండపైకి అనుమతి లేదని తెలిపారు. బారికేడ్లు పటిష్టంగా ఉంచాలని, వంశధార నదిలో చక్రతీర్థ స్నానానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. క్షీరాభిషేక సేవ సమయాలను అర్చకుడు మహేంద్రాడ సాయిశర్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

నదులకు గర్భశోకం కలిగేలా ఇసుక తవ్వేశారు. ఆ గట్లు పాతాళానికి పోయేలా వాహనాలు తిప్పారు. ఊళ్ల చెవులకు చిల్లులు పడేలా ట్రాక్టర్లను నడిపించారు. లెక్కపెట్టలేనంత సొమ్మును అక్రమంగా జేబులో వేసుకున్నారు. ఐదేళ్ల పాటు ఇసుక తిని కోట్లు గడించిన టీడీపీ నాయకులు ఇప్పుడు ఇసుక ర్యాంపులపై గగ్గోలుపెడుతున్నారు. ప్రభుత్వం అధికారికంగా ర్యాంపులు నిర్వహిస్తూ ఉంటే వాటిపై బురద జల్లుతున్నారు.

రీచ్‌ల్లో మారీచులు



ఆమదాలవలస మండలం దూసి గ్రామం వద్ద నాగావళి నదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్న దృశ్యం(ఫైల్)

- అధికారంలో ఉన్నంతకాలం ఇసుకను దోచుకున్న టీడీపీ నాయకులు
- నేనే రాజు–నేనే మంత్రి, బిగ్‌బాస్‌నంటూ రూ. వేల కోట్ల సంపాదన
- ఇప్పుడు అధికారిక ఇసుక ర్యాంపులపై బురద జల్లుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : అధికారంలో ఉన్న ఐదేళ్లు నదులు, వాగులు, వంకలను వదలకుండా దోపిడీకి పాల్పడిన టీడీపీ నాయకులు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు. వీరి దోపిడీకి నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా నదులు ఎంత బక్కచిక్కిపోయాయో అందరికీ తెలుసు. ఇప్పుడేమో ప్రభుత్వంపై ఇష్టానుసారం విమర్శలు చేస్తున్నారు. అప్పట్లో జిల్లా శాండ్ కమిటీ పర్యావరణ అనుమతులున్న రీచ్‌ల నుంచే ఇసుకను తవ్వాల్సి ఉన్నా అనుమతులతో సంబంధం లేకుండా నదుల్లో కాసుల వేట సాగించారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లో ఇసుక తవ్వకాలు జరపకూడదని నిబంధనలు ఉన్నా అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకూ ర్యాంపుల్లో జేసీబీలు, పొక్లెయినర్లతో తవ్వకాలు జరిపిన దాఖలాలు ఉన్నాయి. వంతెనలకు, ఇరిగేషన్ పంపులు, వాటర్ ఫిల్టర్ సంపులకు 500మీటర్లు దూరంలో ఇసుక తవ్వకాలను చేపట్టాలి. కానీ నిబంధనలు ఎక్కడా పట్టించుకోలేదు.



ఆమదాలవలస మండలం దూసి గ్రామం వద్ద నాగావళి నదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్న దృశ్యం

దోచుకున్న వారే..

ఇసుకను ఇష్టానుసారం దోచుకున్న వారే ఇప్పుడు ఇసుక అక్రమాల పేరుతో ధర్నాలు, నిరసనలు చేసి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారు. పర్యావరణానికి విఘాతం కలగకుండా, నదులు నాశనం కాకుండా, నీటి వనరులు దెబ్బ తినకుండా నిర్దేశిత ఇసుక ర్యాంపులకు అనుమతిచ్చి, ఇసుక తవ్వకాలు జరిపించి, తద్వారా ప్రభుత్వం ఆదాయం సమకూర్చేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంటే 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టు బురద జల్లే కార్యక్రమానికి టీడీపీ నేతలు ఒడిగడుతున్నారు.



చెవ్వాకులపేట గ్రామంలో వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు (ఫైల్)

నదుల్లోకి రోడ్డు లేసి మరీ తవ్వుకుపోయారు. రీచ్‌ల వద్ద లారీకి రూ. 6వేల నుంచి రూ.10వేల వరకూ వసూలు చేసిన దాఖలాలు ఉన్నాయి.

ఎక్కడెక్కడ ఎలా దోచుకున్నారంటే..

- ఆమదాలవలస నియోజకవర్గంలో నాటి ఎమ్మెల్యే కూన రవికుమార్ బంధువులు, అనుచరగణం పాత్ర అందరికీ తెలిసిందే. సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం ఇసుక ర్యాంపు కూన రవికుమార్‌కు బంగారు గని మాదిరిగా ఉపయోగపడిందని అందరూ అంటారు. పోతయ్యవలస ర్యాంపు వద్ద నిబంధనలకు విరుద్ధంగా నదిలోనే లారీలు రాకపోకలు సాగించాయి. పురుషోత్తపురం ర్యాంపు వద్ద ఇసుక కోసం వందల సంఖ్యలో లారీలు బారులు తీరిన సందర్భాలుండేవి. ఆమదాలవలస మండలం దూసి రైల్వే వంతెన సమీపంలో నాగావళి నదిలో ఇసుక తవ్వకాలు జరిపిన దాఖలాలు ఉన్నాయి.
- పొందూరు మండలం సింగూరు పేరుతో అనుమతులు ఇచ్చిన ర్యాంపును చూపించి నాగావళికి అవతల ఇసుక తవ్వేసి దూసి గ్రామం మీదుగా అక్రమ రవాణా చేయించారు. ఆమదాలవలస మండలంలోని నిమ్మ తొర్లాడ, జీకేవలస, కొత్తవలస, దూసిపేట, ముద్దాడపేట, తొగరాం, గోపినగర్ ప్రాంతాల్లో కూడా ఇసుకను అక్రమంగా దోచుకున్నారు. విశాఖ అవసరాల పేరుతో దోపిడీకి పాల్పడ్డారు.
- నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం తదితర ర్యాంపుల్లో నాటి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అనుచరులు భారీగా వసూలు చేశారు.

టీడీపీ నేతల ఆగడాల్లో కొన్ని..

- 2014మే 14వ తేదీన టీడీపీ ఇసుక మాఫియా రెచ్చిపోయింది. ఇసుక దందా నియంత్రణకై నియమించిన వీఆర్‌ఓలపై దాడి చేసింది. సైరాలో జరిగిన ఈ ఘటనలో చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు, చంద్రభూషణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. టీడీపీ అండ్‌తో చేసిన దాడి అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.
- నరసన్నపేట మండలం లుకలాంలో 2016లో అక్రమ ఇసుక తవ్వకాలు, ఇసుకను గుర్తించిన నాటి ఆర్డీవో దయానిధి, డీఎస్పీ భార్గవనాయుడు, అప్పటి మైన్ ఏడీలు లుకలాం మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు చేసేందుకు యత్నించగా, నాటి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అడ్డుకుని ఇసుకాసురులకు కాపుకాశారు.
- నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం దగ్గర రాత్రి 11 నుంచి తెల్లవారు 3 వరకు స్టాక్ పెట్టుకుని రోజుకి నాలుగైదు వందల లారీల ద్వారా తరలించారు. ఇప్పటికీ ఆ దృశ్యాలు అటుగా వెళ్లిన వారికి గుర్తుంటాయి.
- ఆమదాలవలస నియోజకవర్గం పురుషోత్తపురం ఇసుక ర్యాంపులోకి కూన రవికుమార్ అండ్‌కోకు చెందిన 25 లారీలతో పాటు నాలుగు జేసీబీలు అక్రమంగా వెళ్లి వరద పోటుకు మునిగిపోయాయి. డ్రైవర్లు, క్లీనర్లు వరద దిగ్బంధంలో చిక్కుకున్నారు. రాత్రి వేళల్లో నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి తవ్వకాలు చేస్తుండగా వరద ముంపునకు గురయ్యారు.
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో తమ్మినాయుడుపేట, ముద్దాడ పేట, పొన్నాడలో అనధికార ఇసుక ర్యాంపులు నడిచాయి. నాటి జెడ్పీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, నాటి మంత్రి కళా వెంకటరావు మధ్య వివాదం కూడా నడిచింది.
- నేనే రాజు– నేనే మంత్రి అని అప్పట్లో ఎవర్ని అనేవారో జిల్లా ప్రజలందరికీ తెలుసు. ఇసుక వ్యవహారంగా బిగ్‌బాస్‌గా ఎవర్ని పిలిచేవారో రాష్ట్రమంతా తెలుసు. మంత్రి హోదాలో కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రభుత్ విప్‌గా కూన రవికుమార్ కనుసన్నల్లోనే ఇసుక అక్రమాలు భారీగా సాగాయి.





పురుషోత్తపురం గ్రామంలో వంశధార నదిలో మునిగిపోయిన వాహనాలు (ఫైల్)

గోపాలపెంట, మడపాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, నాటి ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున దందా నడిపారు. గోపాలపెంట, మడపాం, చేనులవలస, బుచ్చిపేటలో అనధికారిక ర్యాంపు నిర్వహించి బగ్గు రమణమూర్తి పెద్ద ఎత్తున లబ్ధి పొందారు.

- పాతపట్నం నియోజకవర్గంలో వరదల కారణంగా వంశధారలో మేట వేసిన పొనుటూరు, మాతల వద్ద నాటి ఫిరాయింపు ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కనుసన్నల్లో అక్రమ తవ్వకాలు జరిగాయి. వంశధార రిజర్వాయర్ నిర్మాణ అవసరాల పేరిట హిరమండలంలోని భగీరథపురం, పిండ్రువాడ, అక్కరాపల్లి, అంబావలి, రుగడ కొమనాపల్లి తదితర గ్రామాల నుంచి ఇసుకను బహిరంగంగా తరలించారు.
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న బాహుదా నదిలో నిషేధిత ప్రాంతాలన్నింటిలోనూ ఇసుకను ట్రాక్టర్లతో తరలించారు. ఇవన్నీ స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ అండదండలతో జరిగాయి.
- శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలోని పొన్నాం–బట్టేరు ఇసుక ర్యాంపుల నిర్వహణలో అచ్చెన్నాయుడు అనుచరులు దందా చేశారన్న వాదనలు ఉన్నాయి. కల్లేపల్లి, భైరి ర్యాంపుల్లో టీడీపీ నేతల ఆగడాలు తెలిసిందే. జిల్లా నేతలు చాలదన్నట్టు గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ మంత్రి అనుచరులు కూడా ఇక్కడికొచ్చి ఇసుక దందా చేశారు.

పాతపట్నంలో ఇంటింటికీ వంశధార



- పాతపట్నం ప్రజలకు రూ. 265కోట్లతో తాగునీటి ప్రాజెక్టు
- బృహత్తర ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్
- ఫలించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషి
- ఉద్దానం ప్రాజెక్టులో భాగంగా విస్తరణ పనులు
- నేడు శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : పాతపట్నం తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే మహత్తర క్రతువు సోమవారం ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో వంశధార జలాలను ఇంటింటికీ అందించే పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషికి తగ్గ ఫలితం సాకారం కాబోతోంది. పాతపట్నం మండలంలోని కాగువాడ గ్రామ సమీపంలో నిర్మించతలపెట్టిన రూ. 265కోట్ల బృహత్తర తాగునీటి ప్రాజెక్టుకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు చేతుల మీదుగా నేడు శంకుస్థాపన జరగనుంది.

హిరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి రూ.740కోట్లకు పైగా వ్యయంతో వంశధార జలాలను తరలిస్తున్న విషయం తెలిసిందే. ఇంత ప్రాజెక్టు ఇక్కడే నిర్మించినా పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు మాత్రం ఇంటింటికీ వంశధార జలాలు అందే పరిస్థితి ఇప్పటివరకు లేదు. పక్కనే ఉన్నప్పటికీ తమకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదని నియోజకవర్గ ప్రజలు ఎప్పటి నుంచో ఆవేదన చెందుతున్నారు. వీరి డిమాండ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇంటింటికీ స్వచ్ఛమైన వంశధార జలాలను అందించేందుకుగాను ఉద్దానం ప్రాజెక్టు విస్తరణలో భాగంగా రూ. 265 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేయడమే కాకుండా పనులకు టెండర్లు ఖరారు చేశారు. రాష్ట్రంలో కీలకమైన మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఆ టెండర్లను దక్కించుకుంది. హిరమండలం రిజర్వాయర్ నుంచి 0.289టీఎంసీల నీటిని పాతపట్నం నియోజకవర్గ ప్రజల కోసం వినియోగించేలా ప్రాజెక్టు నిర్మించనుంది.

448 హేబిటేషన్లకు స్వచ్ఛమైన తాగునీరు

పాతపట్నం నియోజకవర్గంలో 448 హేబిటేషన్లలోని ఇంటింటికి స్వచ్ఛమైన వంశధార జలాలను అందించేలా ప్రాజెక్టు డిజైన్ చేశారు. రాబోయే 30 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా ప్రాజెక్టు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని 2021 జనాభా ప్రకారం 2.94లక్షల మందికి ప్రస్తుతం, 2051నాటికి 3.75లక్షల మందికి తాగునీరు అందించనుంది. ఒక్కొక్కరికీ రోజుకి 55లీటర్ల తాగునీరు అందించడమే తాజా ప్రాజెక్టు ఉద్దేశం. మండలాల వారీగా చూస్తే మెళియాపుట్టిలో 153 హేబిటేషన్లు, పాతపట్నంలో 112 హేబిటేషన్లు, హిరమండలంలో 59 హేబిటేషన్లు, కొత్తూరులో 64 హేబిటేషన్లు, ఎల్ఎన్‌పేటలో 60 హేబిటేషన్లకు ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరగనుంది. మూడు క్లస్టర్లుగా విభజన చేసి, పనులు చేపట్టి, వంశధార జలాలు అందించనున్నారు. క్లస్టర్ 1లో హిరమండలం(15హేబిటేషన్లు), ఎల్ఎన్‌పేట(60), కొత్తూరు(54), క్లస్టర్ 2లో పాతపట్నం(112), హిరమండలం(44), కొత్తూరు(10), క్లస్టర్ 3లో నియోజకవర్గంలోని మిగతా 153 హేబిటేషన్లకు తాగునీరు అందించనున్నారు.

జరగనున్న పనులు

నియోజకవర్గం వ్యాప్తంగా 9,84,536ఆర్ఎంటీ పైపులైన్ వేయనున్నారు. 40వరకు వివిధ రకాల జీఎల్ బేలెన్సింగ్ రిజర్వాయర్లు, సంప్‌లు, ఓవర్ హెడ్ బేలన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించనున్నారు. అదే విధంగా 56పంపు సెట్లు ఏర్పాటు చేయనున్నారు.

‘రాష్ట్రస్థాయిలో సత్తా చాటండి’



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తాచాటి జిల్లా జట్టు రాణించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపికలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సబ్-జూనియర్స్ బాలబాలికలు, సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 190 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సాధు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ ఎంపికలకు డి.తవిటమ్మ, ఎం.తిరుపతిరావు, టి.యమునారాణి, ఎస్.రమేష్‌లు సెలెక్షన్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం ఉపాధ్యక్షులు సాధు ముసలినాయుడు, సీహెచ్ ఫల్గుణరావు, జగన్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు రాక



పాతపట్నం: మండలంలోని కాగువాడ గ్రామం చంద్రయ్య కాలనీ సమీపంలో ఉద్దానం తాగునీటి పథకం విస్తరణ రెండో దశ పనులకు, నియోజకవర్గంలో 448 గ్రామాలకు రూ.265కోట్లతో ఇంటింటికి తాగునీరు పథకం శంకుస్థాపనకు ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు రానున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్ రామ్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలిసి మంత్రి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉప ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఒక్కరోజే రూ. 50.90 లక్షల ఆదాయం



డిఎల్‌వి రమేష్‌బాబు, ఆలయ ఈవో

అరసవల్లి: స్థానిక ఆదిత్య క్షేత్రంలో నిర్వహించిన రథసప్తమి ఉత్సవానికి సుమారు లక్ష మంది వరకు భక్తులు వచ్చినట్లుగా ఆలయ అధికారులు అంచనా వేశారు. అనుకున్నట్లుగానే భారీగానే భక్తులు వివిధ దర్శన మార్గాల్లో స్వామిని దర్శించుకున్నారు. దీంతో రథసప్తమి నాడు దర్శన టిక్కెట్లు, ప్రసాదాలు, ఆర్జిత సేవల ద్వారా మొత్తం రూ.50,90,530 వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు వివరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన వివరాలను వెల్లడించారు. తాజాగా రథసప్తమి నాడు విశిష్ట దర్శనం (రూ.500) టిక్కెట్లు ద్వారా రూ. 5,05,000, ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.100) టిక్కెట్లు ద్వారా రూ. 7,43,000, వీఐపీ దర్శనం (రూ.500) టిక్కెట్ల ద్వారా రూ. 11,23,500, క్షీరాభిషేక టిక్కెట్లు (రూ.500) ద్వారా రూ. 7,58,220, కేశఖండన శాల (రూ.40) టిక్కెట్లు ద్వారా రూ.48,760 లతో పాటు విరాళాల ద్వారా రూ.57,690, లడ్డూ ప్రసాదం (రూ.15) టిక్కెట్ల ద్వారా రూ.7,58,220, పులిహోర ప్రసాదం (రూ.10) టిక్కెట్ల ద్వారా రూ. 6,54,360 ఆదాయం లభించినట్లుగా వివరించారు. ఇదే గత రథసప్తమి నాడు రూ.48,65,508 వరకు ఆదాయం లభించిందని, దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది ఆదాయం రూ.2,25,022 వరకు పెరిగిందని ఆలయ ఈఓ ప్రకటించారు

విద్యార్థుల ఇళ్లకు డీఈఓ, ఎంఈఓ



విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వర్క్ బుక్స్‌ను తనిఖీ చేస్తున్న డీఈఓ, ఎంఈఓ వెంకటేశ్వరరావు, అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ కురమాన అప్పారావులు శనివారం రాత్రి భవానీపురం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం భవానీపురం ప్రాథమిక పాఠశాల పర్యవేక్షించినప్పుడు విద్యార్థుల వద్ద ఉండాల్సిన వర్క్ బుక్స్ ఇంటి వద్ద మర్చిపోయారంటూ హెచ్‌ఎం టి.షణ్ముఖరావు చెప్పడంతో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయాలంటూ డీఈఓ, ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు విద్యార్థుల వద్దకు వెళ్లి పుస్తకాలు తనిఖీ చేసినప్పుడు వారి వద్ద ఎలాంటి పుస్తకాలు లేవని, వర్క్ బుక్స్‌లో తొమ్మిది పాఠ్యాంశాలకు సంబంధించి దిద్దుబాటులు లేకపోవడాన్ని గమనించినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

షోకాజ్ నోటీసులు జారీ



ఇచ్ఛాపురం రూరల్: జిల్లా ఇన్‌చార్జి ఉప విద్యాశాఖాధికారి జి.విజయ కుమారి, ఇచ్ఛాపురం, కవిటి ఎంఈఓలు కె.అప్పారావు, ఎం.ధనుంజయలకు ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి ఆదివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఇటీవల ఇచ్ఛాపురం గవర్నమెంట్ హైస్కూల్, లాలాపేట ప్రాథమిక పాఠశాల, భవానీపురం ప్రాథమిక పాఠశాల, కవిటి మండలం ఆర్.బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసినప్పుడు 9వ తరగతి విద్యార్థుల వద్ద ట్యాబ్స్ లేకపోవడం, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠ్యాంశాలను పూర్తి చేయకపోవడం, ఐఎఫ్‌పీ బోర్డులను వినియోగించకపోవడం, విద్యార్థుల వద్ద నోట్ పుస్తకాలు లేకపోవడం, వర్క్ బుక్స్‌ను దిద్దకపోవడం వంటివి గమనించారు. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ కోరారని డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఐదు మంది ఉపాధ్యాయులకు..

ఈ పాఠశాలల్లో విధుల్లో అలసత్వం చూపినందుకు ఐదుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ కురమాన అప్పారావు తెలిపారు. షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో భవానీపురం హెచ్‌ఎం టి.షణ్ముఖరావు, సహోపాధ్యాయుడు చీమల కృష్ణారావు, లాలాపేట పాఠశాల హెచ్‌ఎం జ్యోతి మహంకాళి, సహోపాధ్యాయులు వలిశెట్టి రాజేష్ నాయక్‌లు ఉన్నారు.

క్లుప్తంగా

నీటి సంపులో ఎలుగు పిల్ల


నీటిలో పడి ఉన్న ఎలుగుబంటి పిల్ల

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం శివ రాంపురం గ్రామ సమీపంలో గల కొండ ప్రాంతంలో ఉన్న ఒక నీటి సంపులో ఆదివారం ఉదయం ఒక ఎలుగు బంటి పిల్లను స్థానికులు గుర్తించారు. గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు అటుగా వెళ్తున్న సమయంలో ఆ నీటి సంపు నుంచి అరుపులు వినిపించడంతో వెళ్లి చూడగా ఎలుగు పిల్ల కనిపించింది. దీంతో ఆ గ్రామస్తులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి రక్షించారు.

అట్టహాసంగా కమ్మసిగడాం జాతర


పూజలందుకుంటున్న మహాలక్ష్మి తల్లి

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారి కల్యాణ క్రతువుతోపాటు సాంస్కృతిక, పౌరాణిక ప్రదర్శనలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జేఆర్ పురం సీఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో సుమారు 150 మందితో ఆరుగురు ఎస్ఐల సమక్షంలో జాతర బందోబస్తు ఏర్పాటు చేశారు.

అరసవల్లిలో మాఘ మాస ప్రత్యేక పూజలు


క్షీరాన్నం వండుతున్న మహిళలు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం మాఘమాస ప్రత్యేక పూజలు జరిగాయి. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రపుష్కరిణి ఒడ్డున పిడకల పొయ్యిలపై మహిళలు క్షీరాన్నాన్ని వండి స్వామికి ప్రసాదంగా సమర్పించారు. ఇతరజిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనంతో పాటు ఉచిత దర్శనానికి వీలుగా భక్తులకు క్యూలైన్లలో మంచినీరు, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయించారు. అలాగే పాలను కూడా అందజేయడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ. 2,92,300, లడ్డూ పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.60 లక్షలు, విరాళాల ద్వారా రూ.1,57,741 వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.

కూర్మనాథుని సన్నిధిలో అడిషనల్ డీజీపీ


శ్రీకూర్మనాథుని సన్నిధిలో అడిషనల్ డీజీపీ రవిశంకర్

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథుడిని అడిషనల్ డీజీపీ ఎ.రవిశంకర్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీసన్నిధి, తాబేళ్లపార్కు, రెండు ధ్వజస్తంభాలు, ఆకుపసర చిత్రాలను సందర్శించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు క్షేత్రమహత్యాన్ని తెలియజేసి, చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

పైపుల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం


కాలిపోయిన పైపులు

పొందూరు: మండలంలోని రాపాక కూడలికి సమీపంలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ పక్కనే ఉన్న శ్యామల పైపుల ఇండస్ట్రీలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో వెంటనే అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించగా సకాలంలో చేరుకుని మంటలను పూర్తిగా అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్షలు విలువైన రసాయనాలతో పాటు పైపులు, ప్యానల్ బోర్డులు, విలువైన సామగ్రి కాలిపోయాయి. రసాయనాలు మండటంతో మంటలను ఆపడం కష్టమైంది. దట్టమైన మంటలు వ్యాపించి అగ్నిమాపక సిబ్బందికి ఊపిరి ఆడ లేదు. అయితే ఎలాంటి ప్రాణహాని లేకుండా మంటలను నిలువరించారు.

టార్గెట్ నంబర్ 1

- టెన్త్ ఉత్తీర్ణతలో రాష్ట్రంలో మొదటి స్థానం లక్ష్యంగా అడుగులు
- విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి
- మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఎప్పటికప్పుడు హెచ్ఎంలు, సబ్జెక్ట్ టీచర్లకు దిశానిర్దేశం


స్టడీ అవర్స్‌లో నిమగ్నమైన టెక్కలి మండలం సాకిపల్లి జెడ్పీహెచ్‌స్కూల్ విద్యార్థులతో హెచ్ఎం అనురాధ

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమంగా నిలిచేలా జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేస్తున్నారు. మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లగా శ్రీకాకుళం జిల్లాను ఊరిస్తూ వస్తున్న టాప్ ర్యాంకును ఈ ఏడాది ఎలాగైనా సాధించేలా అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారు.

టార్గెట్ నెంబర్ వన్ ప్లేస్..

టెస్ట్ పరీక్షలు వస్తున్నాయంటే విద్యార్థుల్లో ఒకటే టెన్షన్.. అయితే వారు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ఉండేలా ముందు నుంచే ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు జిల్లా విద్యాశాఖ అధికారులు. పాఠశాల విద్య ఉన్నతాధికారులు, గత కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఎప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా దిశా నిర్దేశం చేశారు. 2022లో విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రెండోస్థానంలో నిలవగా.. జిల్లాల విభజన తర్వాత 2023లో వెలువడిన ఫలితాల్లోను శ్రీకాకుళం జిల్లా రెండోస్థానంలో నిలిచింది. దీంతో ఈ ఏడాది టార్గెట్.. నంబర్ వన్ సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు విద్యా సంవత్సరం ఆరంభం నుంచి కృషి చేస్తున్నారు. డీఈఓ ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేస్తున్నారు.

వెనుకబడిన వారిపై ప్రత్యేక ఫోకస్

ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారు. ప్రతిరోజు ప్రభుత్వ బడుల్లో ఉదయం 8.30 నుంచి 9.15 వరకు, సాయంత్రం 4 నుంచి 5 వరకు ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని డైలీ ఆన్‌లైన్ టెస్టులను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 9.15 నుంచి 4 గంటల వరకు ఉన్న సమయాన్ని రెండేసి పీరియడ్స్ చొప్పున నాలుగు సబ్జెక్టులకు కేటాయిస్తున్నారు. జనవరి 2 నుంచి మొదలైన ఈ డైలీ టెస్టులు మార్చి 15వ తేదీ వరకు జరుగుతాయి. మొత్తం 20 మార్కులకు జరిగే 130 మోడల్ టెస్టు పరీక్షలు జరుగుతాయి. రోజుకు నాలుగు సబ్జెక్టులో వారి ప్రతిభను గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏ, బి గ్రేడ్‌లో ఉండే తెలివైన విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు లేదా ఇంటి వద్దే చదివించి మరుసటి రోజు వారితో పరీక్ష రాపించడం చేస్తున్నారు. ఇలా చేయటం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని డీసీఈబీ సెక్రటరీ గెట్టాపు రాజేంద్రప్రసాద్ చెబుతున్నారు.

మొదటి స్థానమే లక్ష్యంగా..



శ్రీకాకుళం జిల్లా గత కొన్నేళ్లుగా పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయి రెండోస్థానంలో నిలుస్తూ వస్తోంది. కానీ ఈ ఏడాది మొదటి స్థానమే లక్ష్యంగా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. అనేక కార్యక్రమాలను, ప్రత్యేక తరగతులను చేపడుతున్నాం. ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ ఉత్తీర్ణతను మరింత మెరుగు పడేలా ఫోకస్ చేస్తున్నాం.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ, శ్రీకాకుళం

• నిద్దాలమ్మా.. కాపాడమ్మా


ముర్రాటలు తీసుకువెళ్తున్న భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారి నిజరూపం

నిద్దాం గ్రామంలో గల నిద్దాలమ్మ తల్లి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తుంతా ముర్రాటలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు, హోమాలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

– జి.సిగడాం

సత్ప్రవర్తనతో మెలగండి


రౌడీషీటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదైన వారంతా సత్ప్రవర్తనతో ఉండాలని సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం, కవిటి మండలాల్లోని పోలీస్‌స్టేషన్లలో రౌడీషీట్లుగా నమోదైన వారితో ఆదివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వారితో మాట్లాడుతూ.. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలిగిన వారిపై రౌడీషీట్లను తొలగిస్తామని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్లను తెరుస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లతో సత్ప్రవర్తనతో మెలగుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌రావు, కవిటి ఎస్ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని చిన్న బొరిగివలసలో రైతు పొన్నాన నాగేశ్వరరావు (53) పాము కాటుకు గురై మృతి చెందారు. ఆయన శనివారం ఉదయం బోడి పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. చాలాసేపటి వరకు ఆయనను ఎవరూ గమనించలేదు. ఎప్పటికీ భర్త ఇంటికి రాక పోవడంతో ఆయన భార్య అన్నపూర్ణ వెళ్లి పరిశీలించగా నాగేశ్వరరావు పొలంలో అచేతనంగా పడి ఉన్నారు. దీంతో స్థానికుల సాయంతో ఆయనను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోయింది. నాగేశ్వరరావుకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి సంతోషి కుమారికి వివాహం కాగా కుమారుడు వెంకటేశ్వరరావు చదువుకుంటున్నాడు. నాగేశ్వరరావు మృతికి పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి


ఇప్పిలి కృపారావు (ఫైల్)

గార: గృహప్రవేశం కోసం షామియానా బిగిస్తుండగా, ఇనుప గొట్టం పైనున్న విద్యుత్ లైనుకు తగిలి షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన శ్రీకూర్మంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీకూర్మం సచివాలయం ఎదురుగా ఉన్న వీధిలో సోమవారం గృహప్రవేశం జరగనుండగా, ఆదివారం మధ్యాహ్నం వేళలో సప్లయర్సు పనివారు ముందుగా పెండెల్ బిగించేందుకు ప్రయత్నించారు. ఇంటి ఎదురుగా ఉన్న రోడ్డు వద్ద ఇనుప పైపు నిలబెట్టే ప్రయత్నం చేయగా మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్‌లైను తగిలి వర్కర్ ఇప్పిలి కృపారావు (22) అక్కడికక్కడే మృతిచెందారు. కృపారావు సొంత ఊరు ఇప్పిలి గ్రామం కాగా, తల్లితండ్రులు కొన్నేళ్ల కిందట బతుకుతెరువు కోసం శ్రీకూర్మం మెయిన్‌రోడ్‌కు వచ్చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు.

హైదరాబాద్‌లో హిరమండలం యువకుడు..


కొల్లి శంకరరావు (ఫైల్)

హిరమండలం: భగీరథిపురం కాలనీకి చెందిన కొల్లి శంకరరావు(26) హైదరాబాద్‌లో పనిచేస్తూ ఈ నెల 17న విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భగీరథిపురం కాలనీ గ్రామానికి చెందిన శంకరరావు హైదరాబాద్ కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. లోన్ కన్సెల్టెన్సీ పేరుతో అక్కడే పని చేస్తున్నాడు. కొత్తగా ఏర్పాటు చేసిన కార్యాలయం వద్ద బ్యానర్ ఏర్పాటు చేసేందుకు పనిచేస్తుండగా హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతి చెందాడు. పోలీసులు శవ పంచనామా చేసి మృతదేహాన్ని అప్పగించారని మృతుడి సోదరుడు నాగరాజు తెలిపారు.

జోరుగా రైల్వే ట్రాక్ మరమ్మతులు


ట్రాక్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: నౌపడ నుంచి గుణుపూర్ వైపు వెళ్లే రైల్వే ట్రాక్ మరమ్మతులు పనులు శరవేగంగా చేస్తున్నారు. కొద్దిరోజులుగా రైల్వే ట్రాక్‌ను పరిశీలించి వాటిని మరమ్మతు చేస్తున్నారు. రానున్న వేసవి దృష్ట్యా ట్రాక్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని, వేగంగా ట్రాక్‌తో పాటుగా ట్రాక్ కింద ఉండే సిమ్మెంట్ దిమ్మలను సైతం మరమ్మతులు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. అలానే రైల్వే ట్రాక్‌కు ఇరువైపుల రాళ్లను సైతం నింపుతూ శరవేగంగా పనులు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని తలగాం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఎదురెదురుగా వెళ్తున్న రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. తలగాం గ్రామానికి చెందిన కె.తవిటినాయుడు అనే వ్యక్తి తన బైక్‌పై టెక్కలి వైపు వస్తున్నారు. తలగాం గేటు నుంచి గ్రామంలోకి పి.భార్గవ్, భవాని శంకర్ అనే ఇద్దరు మరో బైక్‌పై వెళ్తుండగా తలగాం సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో తవిటినాయుడు తలకు తీవ్రగాయాలు కాగా.. భవానీ శంకర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. భార్గవ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గాయపడిన ముగ్గురు వ్యక్తులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి తీవ్ర గాయాలైన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. గాయపడిన తవిటినాయుడు ప్రభుత్వ డిగ్రీకళాశాల అవరణలో క్యాంటీన్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చెయనున్నట్లు తెలిపారు.

‘విద్యార్థుల్లో మేధాశక్తి పెరగాలి’



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: విద్యార్థుల మేధాశక్తి పెంచడానికి టాలెంట్ టెస్టులు ఎంతో అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం తరఫున ఆదివారం స్థానిక గురజాడ విద్యా సంస్థల్లో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మక పెరగడానికి ఇలాంటి మేధోత్సవం ఉపయోగపడుతుందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న టెక్కలి ఉపవిద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి మాట్లాడుతూ జిల్లాశాఖ ఫిజిక్స్ ఫోరం వినూత్న రీతిలో అద్భుతమైన కార్యక్రమాలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ చైర్మన్ జి.రాజేంద్రప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి కుమారి స్వామి, ప్రధానోపాధ్యాయ సంఘం ప్రతినిధులు, జనరల్ సెక్రటరీ రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం జిల్లాస్థాయి నైపుణ్యాభివృద్ధి పరీక్షల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

దాడి కేసులో ఆరుగురికి 14 రోజులు రిమాండ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మాజీ సర్పంచ్ జరుగుళ్ల శంకరరావుపై హత్యాయత్నం కేసులో మొత్తం ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి, శ్రీకాకుళం కోర్టులో ఆదివారం హాజరుపరిచారు. వీరికి 14 రోజులు రిమాండ్ విధించారు. జేఆర్ పురం సీఐ జి.రామచంద్రరావు, ఎస్ఐ చిరంజీవి ఈ కేసును దర్యాప్తు చేశారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిని మొదటి నిందితునిగా శనివారం అరెస్టు చేయగా, ఆదివారం మరో ఐదుగురుని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఎచ్చెర్లకు చెందిన నేతింటి సత్యానారాయణ, బొంతలకోడూరుకు చెందిన పంచిరెడ్డి కైలాస్, శ్రీకాకుళం పట్టణం గుజరాతీపేటకు చెందిన అలబాన మణి, శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడుకు చెందిన కలగ ఉమామహేశ్వరరావు, కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లుకు చెందిన సీపాన లక్ష్మణరావులు ఉన్నారు. వీరికి నోటీసులు అందజేసి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఫరీదుపేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించిన అనంతరం పోలీసులు అరెస్టులు చేశారు.

ఖురాన్ పఠనంతో జీవితం సాఫల్యం

- జిల్లా చరిత్రలో తొలిసారి ఖురాన్ డిగ్రీ అందుకున్న విద్యార్థులు


ఖురాన్ డిగ్రీ అందుకున్న విద్యార్థులతో ముస్లిం పెద్దలు

శ్రీకాకుళం కల్చరల్: ఖురాన్ పఠనంతో జీవిత సాఫల్యం కలుగుతుందని ముఫస్సిరుల్ ఖురాన్ హజ్రత్ మౌలానా డాక్టర్ సయ్యద్ రషీద్ నసీమ్ అన్నారు. జిల్లా చరిత్రలోనే తొలిసారిగా చంపా వీధిలోని చంప మసీద్ మదరసాలో ఐదుగురు విద్యార్థులు హఫీజ్ ఎ ఖురాన్ డిగ్రీని సాధించారు. ఈ సందర్భంగా ముస్లిం ఇమామ్‌లు దస్తర్ బందీ కార్యక్రమాన్ని ఆదివారం టౌన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో నిజాయితీగా జీవించడం ఖురాన్ నేర్పుతుందని వివరించారు. మదరసా ద్వారా మనిషికి మానవత్వం, మంచితనం నేర్పుతారని చెప్పారు. ఈ ఐదుగురు విద్యార్థులు ఖురాన్‌ను గుండెల్లో దాచుకున్నారని, ఎవరికి ఎప్పుడు కావాలన్నా వినిపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ ఏడాది మదరసాలో 35మంది విద్యార్థులు చేరగా వారిలో ఐదురుగు ఖురాన్ పూర్తిస్థాయిలో కంఠస్తం చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు అబ్దుల్ వాహిద్, మహ్మద్ సాహెబ్, మహ్మద్ ఉమర్, మహ్మద్ నదీమ్, మహ్మద్ అమీర్‌లను ఇమామ్‌లను అభినందించారు.

కార్యక్రమంలో మౌలానాలు హమ్మద్ ఇలియాజ్, అహ్మద్ ముఖ్‌బుల్, హుస్సేన్ అహ్మద్, అబ్దుల్ కలామ్, హాజీ షానవాజ్, మహిబుల్లా ఖాన్, మీర్ సాధిఖుల్లా, అమీరుల్లాబేగ్, బోటు, సయ్యద్ జలాల్, ఎం.ఎ.బేగ్, షాన్, డాక్టర్ అదీబ్ హసన్, అబ్దుల్ రెహమాన్, బొబ్బిలి హుదా ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు మహ్మద్ రఫీ, హమీద్ ఇంతియాజ్, బాబ్జీ, అక్బర్, షాదీఫ్, జిలానీ, ముజీబ్, హాజీ సర్ఫరాజ్, ఆర్టీసీ భాషా, హాజీ అమీరుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

జిహ్వ ‘చేప’ల్యం తీరేలా..


ఇవి చేపల వాటాలు. పలాస మండలం మోదుగులపుట్టి గ్రామంలో ప్రతి ఇంటా చేపలకూర వండుకునే సంప్రదాయాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామానికి అనుకుని ఉన్న చెరువులో చేపలు పట్టి 118 వాటాలు వేసి ప్రతి ఇంటికీ పంపించారు. ఇది ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ. ఇప్పటికీ దాన్ని పదిలంగా కొనసాగిస్తున్నారు. – కాశీబుగ్గ

చెరువులో పడి బాలుడు మృతి


మయాంక్ (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: బిర్లంగి ఊరు చెరువులో పడి మూడున్నరేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... ఒడిశా సవరదేవి పేటకు చెందిన కొయ్య శ్రావణి మశాఖపురంలోని తన కన్నవారింటికి ఇటీవల పిల్లలతో వచ్చింది. తన కుమార్తెకు వ్యాక్సిన్ వేసేందుకు తన కుమారుడు మయాంక్‌ను, అక్క దివ్యను వెంట బెట్టుకొని ఆదివారం బిర్లంగి గ్రామ సచివాలయం వద్దకు వెళ్లింది. పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న సమయంలో మయాంక్ ఆడుకుంటూ పక్కనే ఉన్న చెరువుకు వెళ్లి కాలు జారి చెరువులో పడిపోయాడు. విషయం తెలియని తల్లి శ్రావణితో పాటు అక్క దివ్య, అక్కడున్నవారు బాబు తప్పి పోయాడంటూ చుట్టు పక్కల గాలించినా కనిపించలేదు. సుమారు రెండు గంటలు అనంతరం చెరువులో బాలుడు విగతజీవిగా తేలటంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

కమనీయంగా మహా నివేదన


హరిద్రాకుంకుమార్చన

కవిటి: మండలంలోని ముత్యాలపేటలో వెలసిన అమృతవర్షిణి సమేత మహామృత్యుంజయేశ్వరునికి మహానివేదన ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం 25000 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో భాగంగా హరిద్రా కుంకుమ, సింధూరార్చనలు నిర్వహించారు. 24 గంటల పాటు హరేరామహరేకృష్ణ తారక నామమంత్ర యజ్ఞం నిర్వహించారు.